క్లుప్తంగా

ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్‌ : స్థానిక జమ్మలమడుగు రోడ్డులోని అభయ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాస మూడవ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి చుట్టూ ప్రదక్షణలు చేశారు. కాయాకర్పూరాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు.

భక్తులతో కిక్కిరిసిన కొండగోపాలస్వామి ఆలయం



పూజలందుకుంటున్న కొండగోపాలస్వామి

అట్లూరు : శ్రావణమాసం మూడవ శనివారం కొండగోపాలస్వామి ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. శ్రావణమాసం శనివారాలలో కొండూరు గ్రామ పొలిమేర లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీకొండగోపాలస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేయడం ఆనవాయితీ. అందులో భాగంగా మూడవ శనివారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. వచ్చిన భక్తులు ముందుగా స్నానపు కోనేరులో స్నానమాచరించి మొక్కులు తీర్చుకున్నారు. వచ్చిన భక్తుల కోసం ఆలయ కమిటీ వసతులు, తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు ఘనస్వాగతం పలుకుతున్న నాయకులు, గ్రామస్తులు

గోపవరం : బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని శోత్రియ రామాపురంలో శనివారం శ్రీ సీతారామలక్ష్మణ హనుమాన్‌ సమేత ధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్‌ సుధలు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బద్వేలు మున్సిపల్‌ చైర్మన్‌ రాజగోపాల్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్‌చైర్మన్‌ కె.రమణారెడ్డి, సివిల్‌సప్లయ్‌ మాజీ డైరెక్టర్‌ సుందర్‌ రామిరెడ్డి, మాజీ చైర్మన్‌ సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎల్‌పీఎ మండల కార్యదర్శిగా రాజకుమార్‌



బి.కోడూరు : ఆంధ్రప్రదేశ్‌ ప్రొఫెషనల్‌ లీగల్‌ సర్వీసెస్‌ మండల కార్యదర్శిగా గడ్డం రాజకుమార్‌ ఎన్నికయ్యారు. శనివారం బి.కోడూరులో నిర్వహించిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌ ప్రొఫెషనల్‌ లీగల్‌ సర్వీసెస్‌ రాష్ట్ర కార్యదర్శి తోట శ్రీనివాస్‌ తనను ఎన్నుకున్నట్లు రాజకుమార్‌ తెలిపారు. తన మీద నమ్మకంతో తన ఎంపికను కృషి చేసిన రాష్ట్ర కార్యదర్శి తోట శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.


విద్యార్థులు కష్టపడి చదవాలి



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న సీడీపీఓ లక్ష్మిదేవి

కాశినాయన : ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని పోరుమామిళ్ల ఐసీడీఎస్‌ ప్రాజెక్టు సీడీపీఓ లక్ష్మిదేవి తెలిపారు. శనివారం మండలంలోని వరికుంట్ల కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థినులకు చైల్డ్‌ హెల్ప్‌లైన్‌ నెంబర్లు అయిన 1098, 181 నెంబర్లపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రేణిశ్రీ, తేజశ్రీ, నీరజలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ చంద్రకళ, పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



వన్‌టౌన్‌ సీఐ రామకృష్ణారెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు వన్‌ టౌన్‌ సీఐగా రామకృష్ణారెడ్డి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఆయన కమలాపురంలో పని చేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ స్టేషన్‌ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

వైద్యులకు భద్రత, భరోసా కల్పించాలి



కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య సంఘటన లాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా దేశ వ్యాప్తంగా భద్రతా చర్యలు తీసుకోవాలి. ఇదే క్రమంలో ఇలాంటి ఘాతుకాలకు పాల్పడిన వ్యక్తులకు అత్యంత వేగంగా కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాసుపత్రులలో వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందికి భద్రత, భరోసా కల్పించాలి. ప్రత్యేకమైన చట్టాలు తీసుకురావటం ద్వారా మహిళా వైద్యులు వైద్య సేవలను ఉత్సాహం అందిస్తారు.

-పి.కావ్య మాధురి, మండల వైద్యాధికారి, చాపాడు



సమాజంలో మార్పు రావాలి



మహిళల విషయంలో సమాజంలో మార్పు రావాలి. ముఖ్యంగా ప్రజల ప్రాణాలను కాపాడుతున్న వైద్యుల పట్ల ఇలాంటి క్రూరమైన ఆలోచనలు రావడం బాధాకరం. కోల్‌కతా లాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడంతో పాటు డాక్టర్లు నిర్భయంగా విధులు నిర్వర్తించేందుకు భరోసా ఇవ్వాలి.

- డాక్టర్‌ వి.పద్మావతి, గైనకాలజిస్టు, బద్వేలు

ఆసుపత్రుల్లో భద్రత పెంచాలి



కోల్‌కతాలో జరిగిన అత్యాచార ఘటన తీవ్ర అమానుషం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠినచర్యలు తీసుకోవాలి. అధికారులు కూడా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. మహిళా వైద్యులు, సిబ్బందికి అండగా నిలవడంతో పాటు అన్ని వసతులు కల్పించి రక్షణ ఇవ్వాలి. నేరస్తులను కఠినంగా శిక్షించాలి.

- డాక్టర్‌ జ్యోత్స్నస్వర్ణలత, వైద్యాధికారి, తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ

మీ కుటుంబ సభ్యులు, లీడర్లతో ప్రమాణం చేయించండి



ఇసుక తోలుతున్నారని ఫొటోలను చూపిస్తున్న మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : అవినీతి, అక్రమాలకు పాల్పడబోమని మీరు, మీ కుటుంబ సభ్యులు, మీ పార్టీ నాయకులతో ముందుగా ప్రమాణం చేయించాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ పాతకోట బంగారు మునిరెడ్డి హితవు పలికారు. ఎక్కడో.. ఎవరో అవినీతికి పాల్పడుతున్నారని అధికారులతో దేవుని పటాలు పెట్టి ప్రమాణాలు చేయిస్తున్నారని, ముందుగా మీరు నిక్కచ్చిగా వ్యవహరించి మిగతా వారి గురించి మాట్లాడాలన్నారు. స్థానిక వైఎస్సార్‌కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో శనివారం పాతకోట బంగారు మునిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. మీ స్వగ్రామమైన కామనూరు పరిధిలోని కుందూ నది నుంచి అక్రమంగా ఇసుక, గ్రావెల్‌ తరలిస్తుండగా 8 టిప్పర్లను, జేసీబీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ టిప్పర్లపైన నంద్యాల వరదరాజులరెడ్డి (ఎన్‌వీఆర్‌ఆర్‌) అని స్పష్టంగా కనిపిస్తోందన్నారు. మీ సోదరుడి కుమారుడు హరినాథరెడ్డి ఇసుక దందాకు పాల్పడుతున్న విషయం అందరికీ తెలుసునన్నారు. అధికార పార్టీని అడ్డం పెట్టుకుని బహిరంగంగా ఇసుక దందా కొనసాగిస్తున్నారన్నారు. రామాపురం గ్రామంలో మీ వర్గీయుడు ఇష్టారాజ్యంగా పెన్నానది నుంచి ఇసుకను తరలిస్తున్నాడన్నారు. ఎవరి కనుసన్నల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని ప్రశ్నించారు. ఇటీవలి కాలంలో నియోజకవర్గానికి సంబంధించి దాదాపు 120 మందికి రేషన్‌ షాపులు ఇప్పించారని.. వారందరూ రేషన్‌ బియ్యం బయట అమ్మకుండా మీపైనే ప్రమాణం చేయించుకోవాలని వరదరాజులరెడ్డిని కోరారు. మూడో వార్డులో మీ కౌన్సిలర్‌ బియ్యం వ్యాపారం చేస్తున్నారో లేదో తెలుసుకోవాలని సూచించారు. రెండు నెలల్లోనే అరాచక పాలన వచ్చిందని ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్‌ కౌన్సిలర్లు చింపిరి అనిల్‌ కుమార్‌, జిలాన్‌ బాషా, 34వ వార్డు ఇన్‌చార్జి పోసా భాస్కర్‌, వైఎస్సార్‌సీపీ నాయకుడు బాషా పాల్గొన్నారు.

మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని పరిరక్షించండి



మొక్కలను నాటుతున్న విద్యార్థులు

మైదుకూరు : మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పి.నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కళాశాల ప్రాంగణంలో స్థానీయ మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనరేట్‌ ఆఫ్‌ కాలేజీ ఎడ్యుకేషన్‌ సూచన మేరకు స్థానీయంగా పెరిగే మొక్కలైన వేప, కలబంద, సీతాఫలం, చింత, కానుగ, ఎర్రచందనం, నీలగిరి, జామాయిల్‌, జామ వంటి ఔషధ, స్థానీయ మొక్కలను అధ్యాపకులు, విద్యార్థులు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత కోసం మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. వృక్ష శాస్త్ర విద్యార్థులు బి.నవీన్‌, అన్సర్‌ బాష, సుజిత, సౌజన్య, సుమి వలంటీర్లుగా ఈ మొక్కలను సంరక్షిస్తారని ప్రిన్సిపాల్‌ నారాయణరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌ కృష్ణారెడ్డి, రెడ్‌ రిబ్బన్‌ క్లబ్‌ కోఆర్డినేటర్‌ అయ్యవారు రెడ్డి, సి.నరసింహారావు, ఎస్‌.నవనీశ్వర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, చిన్న రాయుడు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచడం బాధ్యతగా భావించాలి



సిద్దవటం రోడ్డులో మొక్కలు నాటుతున్న అధికారులు, పట్టణ అభివృద్ధి కమిటీ నాయకులు

బద్వేలు అర్బన్‌ : మొక్కలు పెంచడం ప్రతిఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని మున్సిపల్‌ కమిషనర్‌ వి.వి.నరసింహారెడ్డి, ఎంపీడీఓ శేఖర్‌రావు, అర్బన్‌ సీఐ రాజగోపాల్‌లు తెలిపారు. బద్వేలు పట్టణ అభివృద్ధి కమిటీ అసోసియేట్‌ అధ్యక్షుడు పెద్దిరెడ్డి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో వృక్షో రక్షతి రక్షితః కార్యక్రమంలో భాగంగా వారు స్థానిక సిద్దవటం రోడ్డులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వాతావరణంలో జరుగుతున్న అనేక రకాల మార్పులకు చెట్లు అంతరించి పోతుండటమే మూలకారణమని, ఇందుకోసం ప్రతిఒక్కరు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించుకోవాలన్నారు. పట్టణంలో 10 వేల మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టిన పట్టణ అభివృద్ధి కమిటీ అసోసియేట్‌ అధ్యక్షుడు సతీష్‌రెడ్డిని ఈ సందర్భంగా వారు అభినందించారు. కార్యక్రమంలో విశ్రాంత జోనల్‌ మలేరియా అధికారి డాక్టర్‌ బి.మునెయ్య, విశ్రాంత డిప్యూటీ సివిల్‌సర్జన్‌ డాక్టర్‌ మీనాక్షిరెడ్డి, బద్వేలు పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాన బాలవెంకటేశ్వర్లు, బి.గురుమూర్తి, గౌరవాధ్యక్షులు కొండపల్లిచిన్నసుబ్బారావు, లీగల్‌ సెల్‌, మీడియా ఇన్‌చార్జిలు మురళి, వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, శ్రీనివాసులరెడ్డి, సత్తార్‌ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్‌ భూములపై జేసీ విచారణ



రైతులతో మాట్లాడుతున్న జేసీ అదితి సింగ్‌

మైదుకూరు : ఫ్రీ హోల్డ్‌ ల్యాండ్స్‌లో భాగమైన రిజిస్ట్రేషన్‌ భూములపై శనివారం జాయింట్‌ కలెక్టర్‌ అదితి సింగ్‌ విచారణ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 20 ఏళ్ల అనుభవంలో ఉన్న భూముల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్‌ హక్కు కల్పించిన విషయం తెలిసిందే. మైదుకూరు మండలంలో 1753 సర్వే నంబర్లలోని 2,728 ఎకరాల భూమి ఫ్రీ హోల్డ్‌ ల్యాండ్స్‌ కింద గుర్తించారు. వీటిలో 555 ఎకరాల మేరకు రిజిస్ట్రేషన్‌ అయ్యాయి. వీటిపై శనివారం మండలంలోని శెట్టివారిపల్లెలో జాయింట్‌ కలెక్టర్‌ అదితి సింగ్‌ విచారించారు. రిజిస్ట్రేషన్‌ హక్కు పొందిన భూములకు సంబంధించిన రైతులతో జేసీ మాట్లాడారు. భూములు ఎలా సంక్రమించాయి, వారసత్వంగానా, కొనుగోలు చేశారా వంటి విషయాలపై ఆమె ఆరా తీశారు. జేసీ వెంట ఆర్డీఓ చంద్రమోహన్‌, తహసీల్దార్‌ రాజసింహ నరేంద్ర, డిప్యూటీ తహసీల్దార్‌ మల్లికార్జున, సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం అధికారులు ఉన్నారు.

టీడీపీ హయాంలోనే అనుమతులు మంజూరు చేశారు



మాట్లాడుతున్న కౌన్సిలర్‌ గరిశపాటి లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు : స్థానిక సూపర్‌ బజార్‌ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న భవనానికి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అనుమతులు మంజూరు చేశారని 10వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌ గరిశపాటి లక్ష్మీదేవి తెలిపారు. టీడీపీ నాయకులు ఈవీ సుధాకర్‌రెడ్డి చేసిన విమర్శలపై ఆమె స్పందించారు. ఈ భవనానికి 2018లో టీడీపీ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ ఆసం రఘురామిరెడ్డి హయాంలోనే అనుమతులు ఇచ్చారని ఆమె పేర్కొన్నారు. అనవసరంగా టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నేతలపై బురదచల్లుతున్నారన్నారు. తమ పార్టీ నాయకులు నిబంధనల ప్రకారమే వ్యవహరించారని ఆమె తెలిపారు. సమావేశంలో 28వ వార్డు కౌన్సిలర్‌ పాతకోట మునివంశీధర్‌రెడ్డి, తొగటవీరక్షత్రియ కార్పొరేషన్‌ మాజీ డైరెక్టర్‌ చౌడం రవిచంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్వార్శల గురునాథరెడ్డి పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి



బెస్త కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

బద్వేలు అర్బన్‌ : మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్‌ సుధలు తెలిపారు. స్థానిక దర్గావీధి సమీపంలో మత్స్యసహకార సంఘం ఆధ్వర్యంలో రూ.35 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన బెస్త కమ్యూనిటీ హాల్‌ను శనివారం వారు ప్రారంభించి మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏటా మత్స్యకారులకు మత్స్యకార భరోసా కింద రూ.10 వేలు అందించిందన్నారు. అలాగే మత్స్య ఉత్పత్తుల వినియోగం పెంచేందుకు సబ్సిడీపై నిరుద్యోగ యువతకు ఫిష్‌ వెండింగ్‌ వాహనాలను అందించారన్నారు. మత్స్యశాఖ సర్టిఫికెట్‌ పొంది 50 ఏళ్ళు పైబడిన మత్స్యకారులకు గత ప్రభుత్వం రూ.2,750లు పెన్షన్‌ అందజేశారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నిక సమయంలో రూ.20 వేలు వేట నిషేధభృతి ఇస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్‌ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మాజీ కుడా చైర్మన్‌ గురుమోహన్‌, మున్సిపల్‌ చైర్మన్‌ రాజగోపాల్‌రెడ్డి, వైస్‌ చైర్మన్‌ సాయికృష్ణ, వార్డు ఇన్‌చార్జి రమేష్‌, మత్స్యసహకార సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకటరమణ, గౌరవాధ్యక్షుడు వజ్రాల వెంకటస్వామి, మాజీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు కృష్ణాష్టమి వేడుకలు

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు నరసింహులు తెలిపారు. ఉదయం 6 గంటలకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అలంకరణ, 9 గంటలకు అమ్మవారికి కుంకుమార్చన ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి శ్రీదేవి, భూదేవి సమేత వేణుగోపాలస్వామి కల్యాణం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం భక్తులకు భోజన సదుపాయం కల్పించామన్నారు. చిన్న పిల్లలకు రాధాకృష్ణుల వేషధారణ పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు, ఉట్ల ఉత్సవంలో మహిళలకు, పురుషులకు వేరు వేరుగా పోటీలు నిర్వహించి బహుమతి ఇస్తామన్నారు. సాయంత్రం 4 గంటలకు గ్రామోత్సవం ప్రారంభమవుతుందన్నారు. రాత్రి 7 గంటల నుండి భగవద్గీత ప్రవచనం ఉంటుందని, భక్తులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

చల్లగిరిగెలలో..

చల్లగిరిగెల శ్రీ పట్టాభి రామస్వామి దేవస్థానంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. కోలాటాలు, రాధాకృష్ణుల వేషధారణ పోటీలు, భజనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


ముందస్తు వేడుకలు



శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో బాలబాలికలు

మైదుకూరు : మండలంలోని జీవీ సత్రంలోని మార్నింగ్‌ స్టార్‌ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో శనివారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికల శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ ఆకట్టుకుంది. వేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్‌ బి.లక్ష్మిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



కోలాటం ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

ప్రొద్దుటూరు : మండలంలోని వాగ్దేవి ఇంజనీరింగ్‌ కాలేజీలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్‌ జి.హుస్సేన్‌ రెడ్డి శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సిద్దేశ్వరరావు మాట్లాడారు. అనంతరం విద్యార్థుల శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలు, ముగ్గుల పోటీలు, కోలాటం, ఉట్టి మహోత్సవం అందరినీ అలరించాయి. ఉత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

26న బాలగోకులం పోటీలు

బ్రహ్మంగారిమఠం : జగన్మాత శ్రీ ఈశ్వరీదేవి మఠంలో శ్రావణ బహుళ అష్టమి శ్రీకృష్ణాష్టమి సందర్భంగా సోమవారం బాలగోకులం పోటీలు నిర్వహించనున్నారు. 5 ఏళ్లలోపు చిన్నారులకు శ్రీకృష్ణ గోపికల వేషధారణ, 10 ఏళ్లలోపు వారికి శ్రీకృష్ణ గోపికల వేషధారణ, పద్యం, శ్లోకం, గానం, డ్రాయింగ్‌ తదితర పోటీలు ఉంటాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు జరుగుతాయి. సనాతన సంస్కృతిపై భావి తరాలైన బాలబాలికలకు చిన్న వయసు నుంచే ఆసక్తి, అవగాహన కల్పించడం కోసం మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి సంకల్పం మేరకు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి బీవీ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. బాల్య మధుర స్మృతులు గుర్తుండిపోయే విధంగా వెన్న చిలకడం, ఉట్టి కొట్టడం వంటి ఫొటో పాయింట్‌ వద్ద ఫొటోలు తీసుకునే అవకాశం ఉందన్నారు. వేదికపైకి తల్లిదండ్రులు కూడా సంప్రదాయ దుస్తులతో చిన్నారులతో కలిసి రావచ్చునని పేర్కొన్నారు. చిన్నారుల పేర్లు రిజిస్టర్‌ చేసుకొనుటకు ఈ ఫోన్‌ నంబర్లు 9441501651, 08569 286064ను సంప్రదించాలని ఆయన వివరించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న అంబేడ్కర్‌ మహిళా సమాఖ్య నాయకురాళ్లు

బద్వేలు అర్బన్‌ : కోల్‌కతాలోని ఆర్‌జీకర్‌ మెడికల్‌ కళాశాలలో జూనియర్‌ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్‌ మహిళా సమాఖ్య నాయకురాళ్ళు నాగరత్నమ్మ, కుమారిలు కోరారు. అత్యాచార ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ శనివారం స్థానిక అంబేడ్కర్‌నగర్‌ నుంచి బైపాస్‌ రోడ్డు వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించడంతో పాటు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు తీసుకురావాలన్నారు. నిరంతరం సమాజానికి సేవ చేసే వైద్యులకే రక్షణలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సులభ బోధన విధానాలతో మంచి ఫలితాలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్‌ జీవీ నాగేష్‌కుమార్‌

చాపాడు : విద్యార్థులకు సబ్జెక్ట్‌పై శ్రద్ధ కల్పించడానికి వీడియోలు, ఇమేజస్‌ ద్వారా సులభ బోధన విధానం పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయని జేఎన్‌టీయూఏ ఈఈఈ విభాగ ప్రొఫెసర్‌ డా. జీవీ నాగేష్‌కుమార్‌ అన్నారు. స్థానిక చైతన్య భారతి ఇన్స్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ(సీబీఐటీ)కాలేజీలో శనివారం 'ఎఫెక్ట్‌ అవుట్‌కమ్‌ బేస్‌డ్‌ ఎడ్యుకేషన్‌'పై విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన జేఎన్‌టీయూఏ ప్రొఫెసర్‌ మాట్లాడుతూ.. లెసన్‌ ప్లాన్‌ విధివిధానాలను ఉపయోగించి సులభతరంగా విద్యా బోధన, విద్యాబోధనలో క్యూర్యాసిటీ విధానాన్ని అవలంబించాలన్నారు. ప్రతి అధ్యాపకుడికి పరిశోధన అవసరమని దానిని సాఫ్ట్‌వేర్‌ యాప్‌ల ద్వారా నేర్చుకోవచ్చన్నారు. ఇలాంటి పద్ధతులను ప్రతి అధ్యాపకుడు అవలంబించడం ద్వారా మంచి క్వాలిటీతో కూడిన విద్యా బోధన అందుతుందన్నారు. కార్యక్రమంలో సీబీఐటీ డైరెక్టర్‌ అడ్మిన్‌ డా.జీ.శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్‌ డా.ఎస్‌. శృతి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్‌ డా.ఎస్‌. అస్లామ్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరైతు పంట నమోదు చేసుకోవాలి



రైతులకు సూచనలు చేస్తున్న జేడీ నాగేశ్వర్‌రావు

ఖాజీపేట : ప్రతిరైతు తాను పండించే పంటను తప్పని సరిగా ఈ క్రాప్‌ ద్వారా నమోదు చేసుకోవాలని జేడీ నాగేశ్వర్‌ రావు సూచించారు. మండలంలోని తుడుమలదిన్నె గ్రామంలో ఈ పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. అలాగే పత్తి పంట సాగుపై రైతులతో మాట్లాడారు. పంటలో వస్తున్న సమస్యల గురించి రైతుల ద్వారా తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఈ పంట నమోదు చేసుకోవడం వల్ల రైతులకు ఎంతో లాభం చేకూరుతుందన్నారు. పంటలు దెబ్బతిన్న పరిహారం ఇచ్చే విషయంలో ఇన్‌పుట్‌ సబ్సిడీ ఇలా అన్ని రకాలుగా రైతులకు మేలు జరుగుతుందన్నారు. అలాగే ఖాజీపేటలోని ఎరువుల దుకాణాలను పరిశీలించారు. అనంతరం యూరియా, డీబీటీ స్టాక్‌ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ నాగార్జున తోపాటు రైతులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా షెడ్‌ నిర్మాణం



తాత్కాలిక కూరగాయల మార్కెట్‌లో నిర్మించిన రూము

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్‌ స్కూల్‌ మైదానంలోని తాత్కాలిక కూరగాయల మార్కెట్‌లో వ్యాపారి యఖీన్‌వలి కుమారుడు వలి నిబంధనలకు విరుద్ధంగా రూము నిర్మించారు. మున్సిపల్‌ నిబంధనల ప్రకారం వ్యాపారులు కేవలం ప్లాట్‌ ఫారాలు మాత్రమే నిర్మించి వినియోగించుకోవాల్సి ఉంది. అయితే సదరు వ్యాపారి తన పలుకుబడితో మార్కెట్‌లో ప్లాట్‌ ఫారంపై రూము నిర్మించి వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. మార్కెట్‌లో అంత మంది వ్యాపారులు ఉండగా వలికి మాత్రమే నిబంధనలు వర్తించవా అని సర్వాత్రా చర్చించుకుంటున్నారు. మున్సిపల్‌ అధికారులు పరిశీలించి అందరికి ఒకే విధానాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ఉంది.

ఆత్మస్థైర్యంతో ముందుకు పోవాలి



బస్సుపాసులు, అట్టలు అందిస్తున్న ఆర్టీసీ డీఎం మల్లికార్జునరెడ్డి, షాకీర్‌ హుస్సేన్‌

ప్రొద్దుటూరు కల్చరల్‌ : దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు పోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్‌ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వికాస్‌ విహార్‌ మానసిక దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో శనివారం ఆంధ్రప్రదేశ్‌ మదర్‌ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో మదర్‌ థెరిస్సా జయంతి సందర్భంగా డీఎం దివ్యాంగ పిల్లలకు బస్సు పాసులు, పలకలు, పరీక్ష అట్టలను అందించారు. సేవా సమితి అధ్యక్షుడు షాకీర్‌ హుస్సేన్‌ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో మదర్‌ థెరిస్సా స్ఫూర్తితో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వికాస్‌ విహార్‌ ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

వాల్‌బాల్‌ పోటీల్లో గోల్డ్‌మెడల్‌



ఖాట్మండులో గోల్డ్‌మెడల్‌ సాధించిన నరసింహారావు

కాశినాయన : మండలంలోని నాయునిపల్లె గ్రామానికి చెందిన తలారి నరసింహులు, జయమ్మల కుమారుడు తలారి నరసింహారావు నేపాల్‌ రాజధాని ఖాట్మండులో శనివారం జరిగిన అంతర్జాతీయ సింగిల్స్‌ వాల్‌బాల్‌ పోటీలో గోల్డ్‌మెడల్‌ సాధించాడు. ఈ నేపథ్యంలోనే విజయవాడలో జరిగిన అండర్‌–18 స్టేట్‌ వాల్‌బాల్‌ పోటీల్లో వైఎస్సార్‌ జిల్లా తరఫున సింగిల్స్‌ ఆడి గోల్డ్‌ మెడల్‌ సాధించాడు. తర్వాత రాష్ట్ర జట్టుకు ఎంపికై రాజస్థాన్‌లో జరిగిన పోటీల్లో గోల్డ్‌మెడల్‌ సాధించాడు. అంతర్జాతీయ పోటీలకు భారత జట్టు తరఫున ఎంపికయ్యారు. శనివారం ఖాట్మండులో జరిగిన వాల్‌బాల్‌ పోటీల్లో బంగారు పతకం సాధించారు. నిరుపేద కుటుంబానికి చెందిన నరసింహారావు ఇంటర్‌ వరకు సగిలేరు గురుకుల పాఠశాలలో చదివాడు. ప్రస్తుతం పోరుమామిళ్లలోని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు.

బహుమతుల ప్రదానం



బహుమతులు పొందిన బాలికలతో అధికారులు

పోరుమామిళ్ల : ప్రభుత్వం చిన్నపిల్లల, బాలికల రక్షణకు చట్టాలు రూపొందించిందని వాటి గురించిన సంపూర్ణ సమాచారం విద్యార్థినులు తెలుసుకుని ఉండాలని ఎంపీడీఓ వరప్రసాదరావు తెలిపారు. శనివారం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికోన్నత పాఠశాలలో ఐసీడీఎస్‌ సీడీపీఓ లక్ష్మిదేవి ఆధ్వర్యంలో బహుమతుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈనెల 14న చైల్డ్‌ హెల్ప్‌లైన్‌ 1098, 181 నెంబర్లపై విద్యార్థినులకు వ్యాసరచన నిర్వహించారు. ఆ పోటీల్లో విజేతలు హారిక, షని, లక్ష్మీహర్షితలకు ఎంపీడీఓ బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడుతూ విద్యార్థినులు హెల్ప్‌లైన్‌ నెంబర్లను అవసరమైనప్పుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు.